క్లుప్తంగా

జి.కొండూరు ఎస్సైగా షబ్బీర్ అహ్మద్



జి.కొండూరు: జి.కొండూరు ఎస్సైగా ఎండీ షబ్బీర్ అహ్మద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై ఆర్ ధర్మరాజు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో షబ్బీర్ అహ్మద్ నియమితులయ్యారు.

5 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మైలవరం: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఈ నెల 5 నుంచి 21వ తేదీ వరకు మైలవరం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల మీద అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తిరువూరు: చెత్తనుంచి సంపద తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి టాటా బిల్డింగ్ ఇండియా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో తిరువూరు నాగార్జున స్కూలు విద్యార్థులు పలు బహుమతులు గెలుచుకున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారావు తెలిపారు. జూనియర్స్ విభాగంలో పీ సుప్రియ, టీ మోక్షిత, టీ శ్రీనివాస్, సీనియర్స్ విభాగంలో డీటీఎల్ మహిమ, టీ వేదిత, ఎన్ మౌనిక విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

9న మెగా లోక్ అదాలత్



తిరువూరు: ఈ నెల 9న మెగా లోక్ అదాలత్ జరుగుతుందని, రాజీ చేసుకో దగిన కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించడానికి న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీ చేయదగినవి గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కరించి విజయవంతం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి అంజనరెడ్డి, ఏజీపీ రాము పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఆంజనేయపురం(తిరువూరురూరల్): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేస్తున్న పనులతో గ్రామాభివృద్ధితో పాటు వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనకు అవకాశం ఉందని తిరువూరు మండలం ఆంజనేయపురం సర్పంచ్ మామిడి కుటుంబరావు అన్నారు. శనివారం ఆంజనేయపురం సచివాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ జరిగింది. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది చేపట్టాల్సిన ఉపాధి పనుల గురించి సభలో చర్చించి ఆమోదించారు. ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ మున్నీ, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

లక్ష్మీపురం(తిరువూరు): కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో తిరువూరు మండలం లక్ష్మీపురం పాల శీతల కేంద్రంలో రైతులకు ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. అమరావతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో ఎముకలు, నరాలు, వెన్నెముక సంబంధిత సమస్యలకు వైద్యపరీక్షలు చేశారు. పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి పర్యవేక్షణలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు.

దేవాలయం నిర్మాణానికి రూ. కోటి విరాళం



నరసాపురం (విస్సన్నపేట): మండలంలోని నరసాపురంలో నూతనంగా నిర్మిస్తున్న సూర్య భగవానుడు, అష్టదైవాలు కొలువుదీరనున్న ఆలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎన్నారై దంపతులు చింతల చంద్రశేఖర్‌రెడ్డి (చందు), హిమవర్షారెడ్డి రూ.కోటి విరాళం ప్రకటించారని ఆలయ నిర్వాహకుడు గొట్టేటి సుబ్రహ్మణ్వేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విరాళం దాత తల్లిదండ్రులు చింతల నరసింహారెడ్డి, రమణమ్మ దంపతులను ఆలయం నిర్మాణ నిర్వాహకుడు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 29న ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పేర్కొన్నారు.

వయోజనులందరికీ ఓటుహక్కు కల్పించడమే లక్ష్యం

- తెలంగాణ ఓట్ల తొలగింపుపై దృష్టి
- కలెక్టర్ ఢిల్లీరావు



తిరువూరులో ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

తిరువూరు: వయోజనులందరికీ ఓటుహక్కు కల్పించడంతోపాటు తెలంగాణలో ఓటు కలిగిన ఆ రాష్ట్ర పౌరులు ఏపీలో కూడా ఓటు హక్కు పొందిన వారి వివరాలు సేకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. తిరువూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేసిన ఆయన అధికారులకు పలు సూచనలిచ్చారు. ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయడం, బోగస్ ఓట్లు తొలగించడం, మరణించినవారు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినవారి ఓటుహక్కు రద్దు చేయడం కోసం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగే విధంగా ఓటర్లను చైతన్యపరచే బాధ్యతను కూడా బీఎల్ఓలకు అప్పగించామన్నారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి, తహసీల్దారు సురేష్‌బాబు, నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఓటుహక్కు పొందాలి

తిరువూరు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ కోరారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక నమోదు కార్యక్రమం, ఓటర్లకు అవగాహన సమావేశాలు జరిగాయి. ఓట్ల చేర్పింపు, తొలగింపు, జాబితాలో సవరణల కోసం బీఎల్ఓలను సంప్రదించాలని ఆయన కోరారు. అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేస్తే త్వరితగతిన ఓటుహక్కు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

18ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

మైలవరం: 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు శ్రీహరి శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జారీ చేసిన ఆదేశాలను అనుసరించి 82-మైలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో శని, ఆదివారాలు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్లెయిమ్స్ స్వీకరించేందుకు సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద బూత్‌స్థాయి అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

చేసే పనిలో ప్రత్యేకతతో గుర్తింపు పొందాలి

గంపలగూడెం: విద్యార్థులు తాము చేపట్టే పనుల్లో ఏదో ఒక ప్రత్యేకత సాధించడం ద్వారా సమాజంలో గుర్తింపును, పనిలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా శనివారం ఆయన విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. ఏకాగ్రత, సాధించాలన్న పట్టుదలతో చదివి విద్యార్థులు మంచి మార్కులను సాధించాలన్నారు.



కాట్రేనిపాడులో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ పూజ



తిరువూరులో ఓటర్ల నమోదు పరిశీలిస్తున్న కమిషనర్



తోటపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

అనంతరం ఓటరు నమోదు కేంద్రంలో సిబ్బందికి కలెక్టర్ తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు నమోదైన పక్షంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తిరువూరు ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, హెచ్ఎం కిరణ్ పాల్గొన్నారు.

జాబితాల్లో తేడాలొస్తే బీఎల్ఓలదే బాధ్యత

ముసునూరు: ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులు తదితర ఓటర్ల జాబితా తయారీలో ఏతేడా వచ్చినా బీఎల్ఓలే బాధ్యత వహించాలని ట్రెనీ అసిస్టెంట్ కలెక్టర్ టి.శ్రీపూజ పేర్కొన్నారు. ముసునూరి మండలం అన్నిపోలింగ్ బూత్‌ల్లో ఓటర్ల చేర్పులు, తొలగింపుల ప్రత్యేక డ్రైవ్ శనివారం ఏర్పాటు చేశారు. కాట్రేనిపాడులోని 91, 92, 93, 94 పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ దాసరి సుధ వేల్పుచర్ల హైస్కూల్లోని 101, 102, 103, 104 పోలింగ్ బూత్‌లను, ఎంపీడీఓ జి.రాణి చింతలవల్లిలోని 84, 85, 86, 87 బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రెనీ అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫారమ్స్ 6, 6ఏ, 6బీ, 7, 8లను నింపే విషయంలో బీఎల్వోలకు సూచించారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు

చాట్రాయి: పారదర్శకంగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని తహసీల్దార్ విశ్వనాథరావు అన్నారు. చాట్రాయి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను ఆయన శనివారం పరిశీలించారు. కొత్త ఓటర్లను చేర్చుకోవడం, మరణించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఆయన బీఎల్ఓలకు సూచించారు.

యువ ఓటర్ల నమోదుకు చర్యలు

ఆగిరిపల్లి: యువ ఓటర్ల నమోదుకు అన్ని చర్యలూ తీసుకున్నామని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. బీఎల్ఓలు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. శనివారం ఆయన ఈదులగూడెం, బొద్దనపల్లి, తోటపల్లి, గ్రామాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.

ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి

మైలవరం: ఓటుతో ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని ఈఆర్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ఎస్ఆర్‌వీజీఎన్ఆర్ కళాశాల, ఎల్‌బీఆర్‌సీఈ ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరి జన్మహక్కు అని, ఓటు హక్కు ద్వారా నిష్పక్షపాతమైన పాలన సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతో ఓటర్ దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ యు. శ్రీనివాసరావు ఎల్‌బీఆర్‌సీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఎస్ఆర్ఎస్‌వీఆర్‌జీఎన్నార్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



నూజివీడులో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట



వరికుప్పలు తడవకుండా పట్టాలతో కప్పిన రైతులు

తిరువూరు: వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఆదివారం నుంచి తుపాను ప్రభావంతో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు డివిజన్ విద్యుత్ డీఈఈ సత్యనారాయణ పేర్కొన్నారు. పొలాల్లో కరెంటు స్తంభాలు, విద్యుత్ వైర్లు, మీటర్ల వద్ద రైతులు అజాగ్రత్తగా వ్యవహరించవద్దని తెలిపారు. గృహావసరాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ఉపకరణాలు వినియోగించేటపుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తడిసిన గోడలను తాకవద్దని, విద్యుత్ షాక్ కలిగే ప్రమాదం గుర్తిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: తుపాను వల్ల గాలులు, భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున మండలంలోని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ కిరణ్ తెలిపారు. విద్యుత్ సమస్య ఉన్నా, పోల్స్ పడిపోయిన వెంటనే విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు గాని, లైన్‌మ్యాన్‌కు, సబ్ స్టేషన్‌కు, ఏఈ దృష్టికి 1912 ద్వారా కాల్ చేయాలని పేర్కొన్నారు.

వ్యవసాయశాఖ సూచనలు

నూజివీడు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో పంటలు సాగు చేసిన రైతులు పలు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి చాముండేశ్వరి శనివారం తెలిపారు. కోతకు వచ్చిన వరిపంటను కోయకుండా కోతను వాయిదా వేసుకోవాలన్నారు. పంట గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను మిషన్‌తో వరి పంటను కోసి ధాన్యాన్ని తడవకుండా చూసుకోవాలని, వర్షాలు తగ్గిన తరువాత ఆరబెట్టుకోవచ్చని సూచించారు. పొలంలో కోసిన వరి పనలు ఉంటే వాటిని వెంటనే కట్టలు కట్టుకొని కుప్పలు వేసుకుని తడవకుండా చూసుకోవాలన్నారు. మొరక పైర్లు, పత్తి తదితర పంటలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వేగంగా వెళ్లేలా వాలుకు వీలుగా గండ్లు చేసుకోవాలని తెలిపారు.

అన్నదాతల్లో తుపాను కలవరం

ఆగిరిపల్లి(నూజివీడు): బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను బలపడుతూ తీరానికి దగ్గరగా వస్తుండటంతో నియోజకవర్గంలోని రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అష్టకష్టాలు పడి పండించుకున్న పంటలు చేతికందే సమయంలో తుపాను రూపంలో ఆపద వచ్చిపడిందని వాపోతున్నారు. శనివారం సాయంత్రానికి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో వరి పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వరి పనలను కుప్పలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వేసిన కుప్పల్లోకి వర్షంనీరు దిగకుండా పాలిథీన్, ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. కోతకు వచ్చిన వరి పంటను కోయకుండా వాయిదా వేశారు. నియోజకవర్గంలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో 20 వేల ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. మండలాల వారీగా నూజివీడులో 5 వేల ఎకరాలు, ముసునూరులో 3,500 ఎకరాలు, ఆగిరిపల్లిలో నాలుగు వేలు, చాట్రాయిలో 7,500 ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. ఇందులో ఇప్పటి వరకు దాదాపు 20 శాతం విస్తీర్ణంలో వరికోతలు పూర్తిచేశారు.

చాట్రాయి: చేతికొచ్చిన వరి పంటను తుపాను ప్రభావం నుంచి రైతులు కాపాడుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ దాదాపు వరి కోతలు 50 శాతం పూర్తయ్యాయని, కోసిన ధాన్యాన్ని తడవకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని పేర్కొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

నూజివీడు: తుపాను నేపథ్యంలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ శనివారం తెలిపారు. వర్షాల వల్ల కరెంట్ మోటార్లు, స్టార్టర్స్, డబ్బాలు తడిసి ఉండటమే కాకుండా సర్వీస్ వైర్లు డ్యామేజీ అయి ఉంటాయని, విద్యుత్ స్తంభాలను ముట్టుకునే లేదా దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

బ్యాంకు సౌకర్యాలపై కళాజాత

ముసునూరు: సహకార బ్యాంకుల ద్వారా ప్రజలకు అన్ని రకాల రుణాలు అందుతున్నాయని, అందరూ ఖాతాలు తెరచి లాభాలు పొందాలని కళాజాతా బృందం అవగాహన కల్పించింది. సహకార బ్యాంకులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు మంచి సేవలందిస్తున్నాయని ప్రదర్శన చేశారు. శనివారం రాత్రి అక్కిరెడ్డిగూడెం, గోగులంపాడు గ్రామాల్లో వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాగళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ద్వారా రైతులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్‌లు పిల్లి సత్యనారాయణ, పులిబళ్ల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎల్‌బీఆర్‌సీఈలో ముగిసిన శిక్షణ

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్‌బీఆర్‌సీఈ)లో సీఎస్ఈ విభాగంలో మూడో సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు గత నెల 27 నుంచి నిర్వహించిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ ఇన్ రియల్ వరల్డ్ సీనారియోపై శిక్షణ తరగతులు శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న స్కిల్స్ ఆధారంగా ప్రాజక్టులు చేయాలని సూచించారు. సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వీరయ్య ప్రసంగించారు.

పాందుగల మహిళల ఐక్యత.. ఆదర్శం

గ్రామ సమాఖ్యను అభినందించిన కలెక్టర్ ఢిల్లీరావు



పొందుగల మహిళలను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైలవరం మండలం పొందుగల గ్రామ మహిళల శక్తి సామర్థ్యాలు, ఐక్యత ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కమ్యూనిటీ కాంట్రాక్టు విధానంలో పొందుగల గ్రామంలో ఇంటింటికీ కుళాయి పనులను విజయవంతంగా పూర్తి చేసిన గ్రామ సమాఖ్య సభ్యులు బి. ఆదిలక్ష్మి, ఎ. ఉమారాణి, బి.ఎలిజబెత్ రాణి, జి.వెంకటేశ్వరమ్మ, జి. బన్నిలను శనివారం కలెక్టర్ ఢిల్లీరావు నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి సత్కరించారు. సమాఖ్యలోని ప్రతి మహిళను ప్రత్యేకంగా అభినందించారు. పొందుగలలో జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ. 3.50 లక్షల నిధులతో కుళాయి నిర్మాణ పనులను చేపట్టడానికి కమ్యూనిటీ కాంట్రాక్టు విధానంతో గ్రామ సమాఖ్యకు పనులు అప్పగించారు. ఇందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్ పైపులైను, 35 కుళాయిలను ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటిని గ్రామ సమాఖ్య సభ్యులు రూ. 2. 55 లక్షలకే పూర్తి చేశారు. ప్రభుత్వానికి రూ. 95వేలు ఆదా చేశారు. అంతేకాకుండా అప్పగించిన 35 కుళాయిల స్థానంలో 50 ఏర్పాటు చేసి కాంట్రాక్ట్ పనుల్లో ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలను సత్కరించి.. మాట్లాడుతూ గ్రామ మహిళల శక్తి సామర్థ్యాలు రాష్ట్రంలోని ప్రతి మహిళకు స్ఫూర్తినిస్తాయన్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటిగా పొందుగల గ్రామాన్ని ఎంపిక చేశారని జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు పర్యవేక్షణలో గ్రామ సమాఖ్య మహిళలకు పనులు అప్పగించారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ దేవినేని వెంకటరమణ, జిల్లా సహకార అధికారి సీహెచ్ శైలజ, ఏపీఎం శామ్యూల్, పవన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శనివారం సాయంత్రం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమికి చెందిన దత్త, గేయ అక్షిత, చంద్రిక, ప్రియాంక, గీష్మ శ్రీ, హేమశ్రీ, సుభిక్ష, యశస్విని, వెన్నెల మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నాట్య ప్రదర్శన చేశారు.

నేడు బ్రాహ్మణ సేవాసమితి వన సమారాధన

విస్సన్నపేట: స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు వెంపటి శ్రీకృష్ణజనార్దన రావు శనివారం తెలిపారు. ఎ కొండూరు రోడ్డులో మద్దల పర్వ స్టేజీ పక్కన ఉన్న గంధం సత్యశ్రీ హనుమంత రావు తోటలో వనసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: కార్తిక మాసం సందర్భంగా గంపలగూడెం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వన సమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని తోటమూలలో గోసవీడు రహదారిలోని మామిడి తోటలో కార్యక్రమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.

పేదల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలు



తోలుకోడు(మైలవరం): పేదల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం తోలుకోడు గ్రామంలో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు బుర్రి ప్రతాప్ తదితరులు పార్టీ జెండా, లబ్ధిని తెలయజేసే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.

ఫ్లోరోసిస్ సామాజిక సర్వే



విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ సామాజిక సర్వే నిర్వహించనున్నట్లు తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. గ్రామాల్లో ఇంటింటి సర్వేతో పాటు పాఠశాలల్లో విద్యార్థులను పరీక్షించటంతో పాటు ఫ్లోరోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ రహిత నీరు తాగాలని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా



గోపవరం హైస్కూల్లో వంటకాల రుచిని పరిశీలిస్తున్న ఎంఈఓ

ముసునూరు: రాగి జావ, మధ్యాహ్న భోజనం నాణ్యంగా తయారు చేసి, పిల్లలకు అందించాలని ఎంఈఓ బీవీ సుబ్బారావు హెచ్ఎంలను ఆదేశించారు. ముసునూరు మండలం గోపవరం హైస్కూల్లో రాగిజావ, మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి పిండి, బెల్లం, బియ్యం, తదితర పదార్థాల నాణ్యతను పరిశీలించి, మంచిగా ఉంటేనే వండి, విద్యార్థులకు వడ్డించాలని హెచ్ఎం నాగేంద్రరావు, వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు.

కమనీయం గుర్రాలమ్మ, గుర్రాలయ్య స్వామి కల్యాణం



కొర్లగుంటలో గుర్రాలయ్య, గుర్రాలమ్మ కల్యాణ మహోత్సవం



స్వామి వార్లను దర్శించుకున్న ఎంపీపీ దంపతులు, నాయకులు

ముసునూరు: గుర్రాలమ్మ సమేత గుర్రాలయ్య స్వామి కల్యాణం మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేసి కల్యాణ మండపంలో అశేష భక్తజన సాక్షిగా అర్చకులు వేదాంతం లక్ష్మీ నరసింహాచార్యులు కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి పుష్ప మాలంకృతులై గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నదానం చేశారు. సొసైటీ అధ్యక్షుడు ఎ.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావు దంపతులు, సీనియర్ నాయకులు ఆర్ సుబ్బారావు, మధుసూదన్‌రావు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కోలాటాలు, చెక్క భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనేక ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా కల్యాణానికి తరలివచ్చారు.

రేపటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు



నెమలి వేణుగోపాలస్వామి ఆలయం

నెమలి(గంపలగూడెం): దేవదాయ ధర్మాదాయశాఖ ఆదేశానుసారం ఈ నెల 4వ తేదీ నుంచి గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాల స్వామి ఆలయం ఆధ్వర్యంలో ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. సనాతన ధర్మపరిరక్షణ, హిందూధర్మవ్యాప్తి, సమాజంలో ఆధ్యాత్మికమైన ఐక్యత, ఏకీకృత ధార్మికభావన తదితర అంశాలే లక్ష్యంగా ఈ ప్రచారం కొనసాగుందన్నారు. మండలంలోని ఉమ్మడదేవరపల్లిలో సంగీత నృత్య కోలాటం, సంకీర్తనలు, భగవత్ వచనాలతో సోమవారం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన పెనుగొలను రంగనాయకస్వామి ఆలయంలో నెమలి వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులకు విశేషపూజ, భగవత్ వచనం, మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న ఆర్లపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులచే వేణుగోపాలుని కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 25న తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరా మండలం గన్నవరంలోని కోదండ రామస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామికి విశేష పూజ, గోపాలలక్ష్మీసుదర్శన హోమం నిర్వహిస్తామని తెలిపారు.

సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ఎస్ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ఘంటసాల జయంతి సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు రాజేష్ ఆధ్వర్యంలో వీర్రాజు, డీజే నాగరాజు, కేవీ రమణబాబు, సయ్యద్ ఆలీ, జోషి, రేష్మ, మాధవి, శ్రీనివాసరావు పలు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతరాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com